"ఆ" అంటే "ఆటం" ఎనెర్జీ! ఏమంటాడు? రామమోహన్? ఏలూరులో దిగిపోతూ ఎవరితోనో తానూ అంతే అన్నాడు. "ఆడదానిపగ అయితే ఎల్లాగైనా భరించవచ్చునుగాని పొగ భరించలేంరా!" అని.

కాని నిజంగా ఆ స్త్రీయొక్క మానసికతత్వాన్ని ఎనలైజు చేసి చూస్తే నేను అనుకొనేది పగకాదు, పొగకాదు. అత్యంతము, ఆకర్షణీయంగాను అస్పష్టంగాను గోచరించే యుద్ధానంతరపు ఏంగ్లో-అమెరికన్-చైనా-రష్యా-పరాసుసమ్మిశ్రితమై పాంచ భౌతికమైన పగ! అని.

.... .... .... .... ....

## యుద్ధానంతర పరిణామం

రిక్షా చెట్టుక్రింద వుంది, చెట్టు పట్నవాసపు చెట్టు. నగరంమధ్యన రోడ్డు ప్రక్కనే వుంది. రోడ్డు తార్రోడ్డు-రోడ్డు కరిగి ప్రాకినట్టు ఇటూ అటూ ఎటూ చీకటిగుయ్యారం. వేళ రాత్రి, రిక్షాసీటును మోసి కూర్చున్నాడో రిక్షావాలా. వాడు లాగే రిక్షాయే అనుకుంటాను ఆ రిక్షా, అలసి మాపటికి మఱి లాగడం ఆపేసుకుని కూర్చుని వుంటాడు. రిక్షాయొక్క కాడి దొడ్డిలో ఓ మత్తకాశిని కూర్చుని వుంది. ఎంత నల్లగా వుండాలో అంత నల్లగానూ వుంది, జుత్తూ మెడా ఏకరంగు అన్నట్టు. ఎంత పిల్లగా వుండాలో అంత పిల్లగానూ వుంది నవ్వు నుదువు ఒకటిగా ప్రకటిస్తూ.

గాజులులివు దానిది, ఒక్కసారి గాబోలు అయింది అల్లా రిక్షాకాడి మువ్వమీద వేలేసి ఆమె ఆడించి నప్పుడు, ఆ ఒక్కసారిలోనే తెలిసింది అనుకోండి అక్కడో ఇద్దఱు వ్యక్తులున్నారని, ఒక ఆడది ఒక మగాడూ—మఱి మళ్ళీ చీకూ చీకటీ! అయితే మాట వెంబడి నవ్వు నవ్వు వెంబడి మాట, రెండూ రానప్పుడెదో గిలిగింత ఎదో గిలిగచ్చకాయ కదలింత, అనుకోని మార్గంగా వినబడ్డం మానలేదు. మూడో మూర్తి, రెండో మొగాడొకడు ఆ ధ్వనికై చేరుకున్నాడా అన్నట్టు ఆమె కాళ్ల దదిసి, వొరిగి, ఆ రిక్షాకాడిమీద తోసి కూర్చున్నాడు.

"కాళ్ళమీద కూకునేవు?" అంది ఆడది. "ఆ లేదు కాడిమీదనే కూర్చున్నాను" అన్నాడు రెండోవాడు. మొదటివాడు వెంటనే ఒక అగ్గిపుల్ల వెలిగిస్తూ ఆడదాని ముఖం దగ్గరెట్టి త్రిప్పాడు. "ఇందాకట్నుంచీ లేని భక్తి ఇంతలో ఎలా పుట్టుకొచ్చిందిరా నీకు, హారతిస్తున్నావు దానికి" అన్నాడు రెండోవాడు. ఆడది మొదటివాని ముఖంవంక చూస్తూ వుంది. అగ్గిపుల్ల ఆరిపోయేలో రెండోవాడు ఆడదాని కొప్పులో ఒక పువ్వు గ్రుచ్చాడు.

"అదేంపనిరా చీకట్లోను" అంది ఆడది. "నేను నా భక్తి కొద్దీ పువ్వెట్టాను" అన్నాడు రెండోవాడు. ఆడది "మీయిద్దఱి మధ్యనూ నేనో నోరులేని రాతి విగ్రహాన్ని అనుకున్నారా? హారతిచ్చేందుకు, పువ్వు పెట్టేందుకు? నేనూ మీలాంటి మనిషినే. ఎటొచ్చీ మీరు మగవాళ్ళు నేను ఆడదాన్ని. వేఱే మగదక్షత లేక ఇలా వచ్చి కూర్చుంటూ వున్నాను" అంది కళ్ళనీళ్ళెట్టుకుంటూ, కళ్ళనీళ్ళు వెంటనే విదిర్చుకుందేమో ఇద్దఱి

మగవాళ్ళమీద చెరో చుక్కా పడింది. ఇద్దరూ కూడా చకితు లయ్యారు. "అమ్మాయీ!" అన్నారు ఒక్క గొంతుగా. "ఎందుకు అమ్మాయీ! బొమ్మిడాయీ?" అంది మిక్కిలి కోపంగా. అని లేచిపోబోయింది. చీకటి దారిచ్చేటట్టు లేదు. అట్టే నిలుచుండి పోయింది గాడీ కాడి దొడ్డిలో బిరి మధ్య త్రాచులా.

"రేపట్నుంచి కాందిశీకులకు మఱి భత్యాలు ఇవ్వ మన్నారు. రంగంనుంచి వచ్చివేసిన జనం రంగం తిరిగి చేరుకు క్షేమంగా ఉండవచ్చునన్నారు. మీకేం? మిరు రిక్షాలాక్కుంటూ ఏ రోజు రూపాయ ఆ రోజు తెచ్చుకు కూర్చుకు తినగలరు. నా మాట? నేను రంగం పోనైనా పోవాలా? ఇక్కడ చావ నైనా చావాలి? మిమ్మలిద్దర్నీ చూస్తే నాకు మహ అక్కసుగా వుంది. రాక్షసినై మిమ్మల్ని యీ పళంగా మింగెయ్యాలని వుంది. ఈ రిక్షా విఱగ్గొట్టేసెయ్యాలని వుంది" అంటూ రిక్షా తన రెండు చేతుల్తో అమ్మ త్తకాశిని ఎత్తేసెయ్య బోయింది. రిక్షా నాను క్కూర్చొన్న వాడు "చచ్చానురో వెనక్కు పడుతున్నా" అని కేకేశాడు. రెండోవాడు వెంటనే కాడిమీద తన కాలేసి అదిమి పట్టి ఎప్పట్లా బండి నేల మోనేటట్టు చేశాడు.

స్త్రీవ్యక్తి పక్కున నవ్వుతూ "నాకోపూట రేపట్నుంచి ఈ రిక్షా లాక్కోవడానికి ఏదో ఓ రూపాయ సంపాదించుకోవ డానికి అవకాశమిస్తారా? లేదా?" అని అడిగింది. ఇద్దరు మగాళ్ళూకూడా "అసలు రోజుకున్నవి రెండే పూటలు ఒకటి పగలు ఒకటి రాత్రి" అని కలిసి జవాబు ఇస్తూ, వేరువేరుగా ఇంకా ఇలా అన్నారు. "ఆడు రాత్రిలాగేవాడు నేను పగలు లాగేవాణ్ణి" అని.

స్త్రీవ్యక్తి "ఓరి! మీ యేర్పాట్లూ మీరూను! ఈ రిక్షా మీదైనట్టే మాట్లాడుతున్నారు" అని గద్దించింది. ఇద్దఱూ "మఱి కాకపోతే మఱెవరిదని నీవూహ!" ఆమె "ఎవరిదో నాకా కథంతా తెలుసు. మీరూ నాలాంటి కాందిశీకులే. మీరూ రంగం నుంచి వచ్చినవాళ్ళే, ఇక్కడ కొచ్చాక మూడో పొద్దు మాట మఱచిపోయినారు వొళ్ళూ చియ్యేబట్టి. మీకు మూడో పొద్దు ఎక్కడుంతో వొక్క నిమేషంలో కనబరుస్తాను. అదే-ఆకలి పొద్దు!" అంది. అంటూ ఆ స్త్రీవ్యక్తి తల విరబోసికొని హుంకరించింది.

రిక్షావాలా లిద్దఱూ ఆ రిక్షాను ఆమెనూ అక్కడ విడిచి పెట్టి పాఱిపోయినారు. "వీళ్ళకు రెండే వెలుగులట—పగటి వెలుగూ రేత్రి వెలుగూ—మూడో వెలుగు లేదట: ఆకలివెలుగు వీళ్ళల్లో వెలిగేలా చేస్తా వీళ్ళ డొక్కలు చీరేస్తా!" అంటూ ఆ వృత్తి రిక్షాను వాళ్ళ వెనకాతలే లాక్కు పోసాగింది గబగబా గబగబా! లాగుతూ ఆగరా! ఓరి పగలు లాగేవాడా? ఆగరా! ఓరి రాత్రి లాగేవాడా? మీ రాత్రింబవళ్ళు రెండింటినీ రూపు మాపే దాన్ని నేను వస్తున్నాను మీ వెనకాతలే! కావలిస్తే ఇద్దఱూ కూర్చోండి ఈ రిక్షాలో! రంగందాకా లాగేస్తాను రంగంలో మీమీ గుమ్మాలకాడ దింపేస్తా, దేవాలయం లేదు. దేవుడూ లేడు. నాకు ఈ రిక్షాయే దేవాలయం. మీరే నాకు దేవుళ్లు! కూర్చోండి రండి రిక్షాలో ఉండండి మీరు. నేను మిమ్మల్ని తిరిగి రంగం తీసుకుపోతా! అక్కడ వదిలేస్తా!" అంటూ వాళ్ళను వెనుదఱిమింది. రిక్షాలాక్కుపోతూనే వుంది వాళ్ళకూడా ఉత్త రిక్షా,

"తెల్లవారింది" అని వ్రాసేలో మగవాళ్ళిద్దఱూ నా ఊహా ప్రపంచంలోంచి మాయమై పోయినారు కాని ఆ స్త్రీ వ్యక్తి మాత్రం స్థిరపడిపోయి ఆలా ఇంకా ఆ వుత్తిరిక్షా లాక్కుపోతూనే వుంది. పట్టపగలు రంగం వీధులంట కూడా ఆమెను పోల్చినవారు లేకపోయినారు. కొందఱు Post-war mad అని తప్పుకున్నారు ఆ వుత్తిరిక్షా ఆలా లాక్కుంటూ రావడం చూచి. కొందఱు Post-war mermaid అని విస్తుపోయారు ఆమె ఆకలి వెలుగుకళ్లు, చీకటి వెఱ్ఱివాళ్లు చూచి.

ఒక్క తెల్లదొర మాత్రం తన మేడమీదనుంచి కనిపెట్టి "మాసరమ్మా! మాసరమ్మా!" అని కేకేశాడు. స్త్రీవ్యక్తి వెంటనే రిక్షాను సముద్రంలోకి విసిరినట్టు విసిరేస్తూ తమరు బ్రతికివున్నారా దొరగారూ? అంది వీధిలోంచి తలపైకెత్తి. ఆమె Ante-war periodలో ఆదొరగారి కొలువులో Servant maidట.

.... .... .... .... ....

## మేనరికపు విభ్రాంతి

రాజనందుడికి మేమమామ కూతురు వొకామెవుంది. రాజానందుడంటే ఎవరో తరువాత చెప్తాను. ముందు రాజానందుడు అనే పేరు మాత్రం జ్ఞాపకంవుంచుకొంటే చాలు పాఠకులు—ఆలాంటి వాళ్లు కొంతమంది వుంటారు ఈ ప్రపంచంలో—వాళ్ళనామధేయాల్ని బట్టి మనస్థగితపురాయళ్లు అయిపోయేవాళ్లు.